క్లుప్తంగా

సీఎం జగన్‌తో చిందేపల్లి భేటీ



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం నగరి నియోజకవర్గ పరిశీలకుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రసాదం, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

కట్టాకు ఎమ్మెల్యే పరామర్శ



రమణారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే సంజీవయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి

నాయుడుపేటటౌన్: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డిని పరామర్శించారు. రమణారెడ్డి చెన్నై వైద్యశాలలో గుండెకు శస్త్రచికిత్సలు చేయించుకుని చికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే చెన్నైకి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయుడుపేట మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు ఉన్నారు.

తప్పులు సరిచేయండి

ఓజిలి: రీసర్వే అనంతరం మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులను సరిచేయాలని మండలంలోని తిరుమలపూడి రైతుల తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకాల్లో చనిపోయినవారి పేర్లు, ఎకరాలు తప్పుగా నమోదై ఉన్నట్లు తహసీల్దార్‌కు విన్నవించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ తప్పులను సరిచేస్తామని తెలిపారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.19 లక్షలు



పోలేరమ్మతల్లి హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వెంకటగిరిరూరల్: గ్రామశక్తి పోలేరమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.19,04,281 ఆదాయం వచ్చిందని దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పాతకోటలోని శ్రీరామ మందిరంలో సోమవారం పోలేరమ్మ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ గత మార్చి 29 నుంచి ఆగస్టు 28వ తేదీ వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. ఇందులో నగదు రూ. 19,04,282 లక్షలు రాగా, యూఎస్ డాలర్లు 115, కువైట్ దినార్-1, బంగారం 10.200 గ్రాములు, వెండి 49.200 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ నగదును బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు దేహశుద్ధి

సూళ్లూరుపేట రూరల్: పిల్లలను కిడ్నాప్‌కు యత్నించిన మహిళను స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన సూళ్లూరుపేట మండలం కోటపోలూరులో సోమవారం రాత్రి కలకలం రేపింది. ఢిల్లీ ప్రాంతానికి చెందిన ఓ మహిళ కోటపోలూరు తూర్పు దళితవాడలో ఇంటి బయట ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయడానికి యత్నించగా స్థానికులు గుర్తించి నిలదీశారు. హిందీలో సమాధానం చెప్పడంతో అనుమానంతో పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం అందించారు. శ్రీహరికోట ఎస్ఐ మనోజ్‌కుమార్ ఆమెను అదుపులోకి తీసుకుని, విచారణ జరుపుతున్నారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జున సాగర్

దక్కిలి: పంట సాగులో రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వెంకటగిరి ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. దక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న వరి పంటలకు ఆశించిన పురుగులు, తెగుళ్ల బెడద నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వెంకటగిరి కృషి విజ్ఞాన శాస్త్రవేత్త రాజీవన్ మాట్లాడుతూ మండలంలో రైతులు సాగు చేస్తున్న ఉద్యాన పంటలైన నిమ్మ, మామిడిలో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఉద్యానవనశాఖాధికారి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ఈక్రాప్ బుకింగ్, బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీ రాజశేఖర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పీ రమణారెడ్డి, ఏఓ విజయభారతి పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. శిరోధార్యం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి
- వాహన రిజిస్ట్రేషన్‌లతో హెల్మెట్‌కు లింకు
- చట్టం అమలుకు కఠిన చర్యలు



సైదాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులు(ఫైల్)

మృత్యువు ఎప్పుడు ఎదురవుతుందో.. ఎలా కబళిస్తుందో..ఎవరికీ తెలియదు. నిమిషంలో అది మన ప్రాణాన్ని మింగేస్తుంది. దీన్ని కొందరు విధి అంటే.. మరికొందరు తలరాత అంటారు. ప్రతి అపాయానికీ ఓ ఉపాయం ఉన్నట్లు.. దీనికీ ఓ చిట్కా ఉంది. విధిని సైతం ఎదురించే శక్తి మన దగ్గరే ఉంది. అదే శిరస్త్రాణం.. ఇది ధరిస్తే శిరోధార్యం.

సైదాపురం: రహదారుల్లో ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ముమ్మరం చేశాయి. దీనిలో భాగంగానే ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంటుంది.అటువంటి నిర్ణయమే వాహన రిజిస్ట్రేషన్‌కు హెల్మెంట్ లింకు చేసింది. కొత్త వాహనం కొనుగోలు చేసిన సమయాల్లోనే హెల్మెట్ తీసుకోవాలనే షరతు విధించారు. హెల్మెట్ ఉంటేనే వాహనం రిజిస్ట్రేషన్ చేయాలని రవాణా శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వాహన రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయంకు వచ్చే వాహన యజమాని కొత్త హెల్మెట్‌ను, దాని బిల్లును సమర్పిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సంబంధిత అధికారులు పూర్తి చేసేలా ఈ నిబంధనలు రూపొందించారు. మోటారు వెహికల్ చట్టం నిబంధన-138(ఎఫ్) ప్రకారం వాహనాలు విక్రయించే డీలర్లు విధిగా హెల్మెట్‌ను అందుబాటులో ఉంచాలి. కానీ వాహన చోదకులు ఆసక్తి చూపనందున ఎవరూ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. డీలర్లు హెల్మెట్‌లు తప్పని సరి చేస్తున్నా వాహన చోదకులు మాత్రం ఇంట్లోనే హెల్మెట్‌లు పెట్టి వాహనాలను నడుపుతున్నారు. సైదాపురం మండలంలో ఇప్పటికే పోలీసు అధిరులు హెల్మెట్ వాడకంపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు.

వాహన వివరాలివీ..	
మండలం	: సైదాపురం
ద్విచక్రవాహనాలు	: 7,500
నాలుగు చక్రాల వాహనాలు	: 250
ఆటోలు	: 175
జనవరి నుంచి ఇప్పటి వరకు	
ప్రమాదాలు	: 10
మృతులు	: 4
క్షతగాత్రులు	: 6



హెల్మెట్‌తో ద్విచక్రవాహనంపై వెళుతున్న ప్రయాణికులు

129 సెక్షన్ ప్రకారం..

మోటారు వాహన చట్టంలోని 129 సెక్షన్ ప్రకారం ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఈ నిబంధనలు ఎప్పటి నుంచో అమల్లో ఉన్నా... ఆచరణకు నోచుకోలేదు. ఈ విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయడంతో దేశమంతా హెల్మెట్ వినియోగంపై దృష్టి మళ్లింది. రోజు రోజుకు పెరుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని, పోలీసులు నిబంధనలు అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక తనిఖీలు కూడా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అధిక మొత్తంలో జరిమానాలను కూడా విధిస్తున్నారు. కనీసం ఆ భయంతోనైనా హెల్మెట్ అలవాటు చేసుకుంటారానే అధికారులు భావిస్తున్నారు.

విస్తృత ప్రచారం అవసరం

- హెల్మెట్‌ల వాడకంపై కరపత్రాలు పంచడం, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వం, ప్రవేట్ సంస్థల ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగం చేసేలా ఆయా సంస్థలు ఆదేశాలు జారీ చేయాలి.
- పాఠశాలలు, కళాశాలల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలి.
- హెల్మెట్ లేకుండా తిరుగుతున్న వాహన చోదకులకు నోటీసులు జారీ చేయాలి.
- పట్టుబడితే తొలిసారిగా కౌన్సెలింగ్ ఇవ్వాలి. పునరావృతమైతే భారీ జరిమానా విధించేలా పోలీసులు చొరవ చూపాలి.

నాణ్యతలేని హెల్మెట్‌తో ప్రయోజనం శూన్యం



పోలీసు కేసులను నుంచి తప్పించుకునేందుకు నాణ్యత లేని హెల్మెట్‌లను కొనుగోలు చేయడంతో ప్రయోజనం లేకపోగా ప్రమాదం అధికం. ఫుట్‌పాత్‌లపై లభించే హెల్మెట్‌లతో ధరలు తగ్గుతాయనే కానీ ప్రాణరక్షణకు గ్యారెంటీ ఉండదు. చిన్న చిన్న ప్రమాదాల్లో వాహన చోదకులు కిందపడితే హెల్మెట్ పగిలి వాటి వలన కూడా గాయాలపాలైన సందర్భాలు అనేకం ఉన్నాయి.

– చల్లా వాసు, ఎస్ఐ, సైదాపురం

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



వాహన వినియోగదారుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ఉపయోగించాలి. లేని పక్షంలో మొదటి సారి అపరాధ రుసుం విధించడం జరుగుతుంది. రెండోసారి, మూడోసారి హెల్మెట్ ధరించకుండా వాహనం నడుపుతూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తాం. లైసెన్సు రద్దు చేస్తాం. వాహన చోదకులు హెల్మెట్‌ను వాడి సంతోషంగా ఇంటికి చేరుకోవాలి.

– చెమిర్తి శ్రీనివాసులురాజు, ఆర్టీఏ అధికారి, సైదాపురం

కష్టపడిన వారికి సముచిత స్థానం



జిల్లా కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

వాకాడు: వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నలగామల గ్రామానికి చెందిన డీ మధుసూదన్‌రెడ్డిని సోమవారం వాకాడులో నాయకులు ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్ రామకృష్ణ, అజిత్‌రెడ్డి, జీవీఆర్, వెంకటరత్నం, సుధాకర్‌నాయుడు, వెంకటరమణయ్య, శివారెడ్డి, సంపత్‌కుమార్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

నేదురుమల్లితో నేతల భేటీ



నేదురుమల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణయ్య

వెంకటగిరిరూరల్: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా కమిటీలో తమకు అవకాశం కల్పించడంపై జిల్లా పరిధిలోని పలువురు నేతలు పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని సోమవారం వెంకటగిరిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా చిట్టమూరు మండలం కే కస్తూరిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ సభ్యుడిగా కలువాయి మండలానికి చెందిన పీ కృష్ణయ్యను నియమించడంతో వారు నేదురుమల్లికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరిరూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సౌత్‌జోన్ అండర్-16 క్రికెట్ పోటీల్లో భాగంగా సోమవారం కడప- అనంతపురం, చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గ్రౌండ్-1లో బ్యాటింగ్ దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లకు 187 పరుగులు చేసింది. ఈ జట్టులో టి ధీరాజ్ 59, ఎస్ విష్ణుసాయి 87 పరుగులు తీశారు. కడప జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్ 84 రన్స్‌తో అనంతపురం జట్టుపై విజయం సాధించింది. గ్రౌండ్-2లో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 41.1 ఓవర్లకు 125 పరుగులు తీసి 5 వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో 38 ఓవర్లకు 97 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఈ జట్టులో సోహాన్ 40 పరుగుల చేయగా కర్నూలు జట్టు బౌలింగ్ విభాగంలో నవసన్ కళ్యాణ్ 6 వికెట్లు తీశారు. కర్నూలు జట్టు 51 పరుగులు ఆధిక్యంలో ఉంది.

సమస్యలకు సత్వర పరిష్కారం

సైదాపురం: స్పందన కార్యక్రమాల్లో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ ఎన్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమక్షంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలస్థాయి అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఈ భాస్కర్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ హోమం

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం శ్రీ మహాలక్ష్మీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, అర్చకులు దివి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శివపార్వతుల కళ్యాణం రేపు

చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 30 ఉదయం 10 గంటలకు శ్రీ కాళహస్తీశ్వరస్వామి-జ్ఞానాంబిక కల్యాణోత్సవం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ డీ బాలచంద్రారెడ్డి తెలిపారు.

టీసీఎల్ టోర్నీ విజేత బాలాయపల్లి





ట్రోఫీని అందుకుంటున్న విన్నర్స్ బాలాయపల్లి జట్టు, రన్నర్స్ వాకాడు జట్టు

గూడూరురూరల్: పట్టణంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26, 27, 28 తేదీల్లో నాలుగు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్(టీసీఎల్) టోర్నీ విజేతగా బాలాయపల్లి జట్టు నిలిచింది. రన్నర్స్‌గా వాకాడు జట్టు నిలిచింది. సోమవారం స్టేడియంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి శ్రియా రియల్ ఎస్టేట్ అధినేత బాబు అగస్టస్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై, విజేతలకు ట్రోఫీలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా రాష్ట్రస్థాయిలో టీసీఎల్ పేరిట క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది 18 మండలాల నుంచి ఉపాధ్యాయుల జట్లు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. ఫైనల్స్‌లో బాలాయపల్లి జట్టు విజేతగా, వాకాడు జట్టు రన్నర్స్‌గా నిలిచాయన్నారు. విజేతకు ట్రోఫీతోపాటు రూ.10 వేలు నగదు, రన్నర్స్‌కు ట్రోఫీతోపాటు రూ.5 వేలు నగదు, జ్ఞాపికలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పురందర్‌రాజు, ప్రభాకర్, పీడీ కరిముల్లాఖాన్, బ్రజేంద్రరెడ్డి, మురళీసింగ్, బాబర్, సతీష్, అంపైర్లు విజయ్,మణి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ గోపీ నాయక్

గూడూరురూరల్: మండలంలోని పాలిచెర్ల రైతు భరోసా కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో సోమవారం వరి, నిమ్మ సాగులో సస్యరక్షణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గూడూరు ఏడీ బి.గోపీనాయక్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్-2084 సందర్భంగా రైతులు చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలని కోరారు. వరి, నిమ్మ పంటల్లో చేపట్టాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వి.రమేష్, టెక్నికల్ ఏఓ చెంచురెడ్డి, సర్పంచ్ కె.విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటాం

నాయుడుపేటటౌన్: సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా పార్టీ తరఫున పనిచేస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని జేసీఎస్ అర్బన్ కన్వీనర్ చదలవాడ కుమార్ అన్నారు. ఇప్పటికే సచివాలయ కన్వీనర్లకు రూ.10 లక్షల వరకు బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేశారన్నారు. అలాగే సచివాలయల గృహ సారథులకు సంబంధించి బీమా నమోదు ప్రక్రియను సోమవారం నుంచి వార్డు సచివాలయల వారీగా నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

చిల్లకూరు: క్యాన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధితురాలికి సోమవారం ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన పాటేళ్ల వాణి ఏడాదిగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. వైద్యులు చెన్నైలోని అడయార్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేక వెళ్లలేకపోయింది. చేడిమాలలోని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులుకు ఈ విషయం తెలియడంతో సంస్థ ప్రతినిధులను పంపి పూర్తి సమాచారం తెలుసుకుని ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ట్రస్టు సభ్యులు బాబు, భాస్కర్ ద్వారా రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నివేదికలు ఇవ్వండి

చిల్లకూరు: డ్రాపౌట్స్‌పై సమగ్రసర్వే చేసి నివేదికలు ఇవ్వాలని ఎంఈఓ సనత్‌కుమార్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ నిర్మలాదేవి ఆధ్వర్యంలో సోమవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నూరు శాతం అక్షరాస్యత సాధించడంతో పాటుగా చదువుకున్న ప్రతి ఒక్కరిలో స్కిల్ డెవలప్‌మెంట్ సాధించేలా తర్ఫీదు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రఫూఫ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సిద్ధవరంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాల పంపిణీనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం సిద్ధవరం సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతో సీఎం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

చెంచురామిరెడ్డికి అభినందన

తిరుపతి పార్లమెంటు కమిటీ సభ్యుడిగా నియమితులైన కే చెంచురామిరెడ్డిని నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అభినందించారు. చెంచురామిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ పట్టాభిరామిరెడ్డి, నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణరెడ్డి, ఎంపీపీ ప్రసన్న, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సీ తిరుపాల్‌రెడ్డి, సీ భాస్కర్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, కే మధుసూదన్‌రెడ్డి, ఎం మధురెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారినీ బడిలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శేషయ్య

తడ: ప్రతి చిన్నారినీ బడిలో చేర్చాలని, బడి బయట పిల్లలు ఉండకూడదని డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీఓ) శేషయ్య మండల అధికారులకు సూచించారు. సోమవారం తడకు విచ్చేసిన ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆమోసుబాబు, ఎంపీపీ కే రఘురెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటికే 355 మంది బడి బయట పిల్లలు ఉన్నట్టు సమాచారం ఉందని, అందులో తమిళనాడు పాఠశాలల్లో చేరిన వారు, పరిశ్రమల్లో పని చేస్తూ పని మానేసి ఊర్లు మారిన వారికి సంబంధించిన వివరాలు తీసుకుని, వచ్చే నెల 4వ తేదీ లోపు ఏ ఒక్కరూ బడి బయట ఉండకుండా చూడాలన్నారు.

జీఈఆర్ వందశాతం సాధించాలి

పెళ్లకూరు: బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేలా తక్షణం చర్యలు తీసుకుని గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో(జీఈఆర్) నూరుశాతం సాధించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రమణ్యం, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

బడిలో చేర్పించాలి

గూడూరురూరల్: డ్రాపౌట్ అందరినీ 4వ తేదీలోపు పాఠశాల, కళాశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో)పై సమావేశం నిర్వహించారు. గూడూరు మండలం, పట్టణంలో సుమారు 1400 మంది వరకు బడి బయట పిల్లలు ఉన్నట్లు సర్వేలో గుర్తించామని, వారందరినీ బడిలో చేర్పించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌డీఓ వాణి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు సనత్‌కుమార్, కాంచన పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



ఆర్డీఓకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

గూడూరురూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలకు సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గూడూరు డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి ప్రజలు సమస్యలపై అర్జీలను అందజేశారు. చిల్లకూరు మండలం తొణుకుమాల, ఉడతావారి పార్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు సుమారు 500 ఎకరాల వరకు అసైన్‌మెంట్, సీజేఎఫ్ఎస్ భూములను సాగుచేసుకుంటున్నామని, పట్టాలు అందించాలని కోరారు. గూడూరులోని అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, దాన్ని పునర్నిర్మించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. చెన్నూరు బిట్-2లో మైనింగ్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని వైఎస్సార్ సేవా మిత్ర సొసైటీ నాయకులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు అందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు ఆర్డీఓ హామీ ఇచ్చారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న కమిషనర్, ఆర్‌అండ్‌బీ అధికారులు

గూడూరురూరల్: పట్టణంలో ఐసీఎస్ రోడ్డులో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఆర్డీఓ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, ఈ క్రమంలో ఆక్రమణలను తొలగిస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌ఓబీ నిర్మాణం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాన్ని గుర్తించామని, పట్టా నివాసాల వారికి నష్టపరిహారం కూడా చెల్లించామన్నారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు ప్రారంభించామని, మరో 4 కట్టడాల వారికి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, డీఈ సుబ్బారెడ్డి, సీఐ వెంకటేశ్వరరావు, విద్యుత్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

సూళ్లూరుపేట: నాయుడుపేట పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలువేసి బయట ప్రాంతాలకు వెళ్లేటపుడు పోలీస్‌కు సమాచారం అందించి వెళ్లాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి కోరారు. నాయుడుపేట కొన్ని రోజులుగా ఒంటరిగా నడిచే వెళ్లే మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్స్ చేస్తున్నారన్నారు. అలాగే నాయుడుపేట పట్టణంలో ఒకేరోజు రాత్రి మూడిళ్లలో చోరీలకు పాల్పడి, భారీ ఎత్తున నగలు, నగదు దోచుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు.

పలు గ్రామాల్లో ఓటర్ల జాబితా తనిఖీ



అక్కరపాకలో ఓటర్ల జాబితా తనిఖీ చేసి, ఓటరును ఆరా తీస్తున్న ప్రత్యేకాధికారి

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను జిల్లా ప్రత్యేక అధికారి శ్రీప్రసాద్‌రావు తనిఖీ చేశారు. జాబితాలో గుర్తించిన వారిని, బదిలీ అయిన వారిని, సవరణలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి ఉన్నారు.

గూడూరు మండలంలో..

గూడూరురూరల్: మండలంలోని పాలిచెర్ల, తిమ్మసముద్రం, గూడూరులో ఓటర్ల జాబితాలను ప్రత్యేకాధికారి సతీష్ పరిశీలించారు. చనిపోయిన వారు, డబుల్‌ఎంట్రీలు, వేరే ఊళ్లకు వెళ్లిపోయిన వారి ఓట్లను బీఎల్వోలు తొలగించి ఉంటారన్నారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే వాటిని సరిచేసి ఓటర్ల జాబితా ముసాయిదాను జనవరిలో ప్రచురిస్తామని తెలిపారు. ఆయన వెంట గూడూరు తహసీల్దార్ బి.లీలారాణి ఉన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



గూడూరురూరల్: మండలంలోని చెన్నూరులో ఉన్న మాతా పరమేశ్వరి కొలుపు మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి అగ్నిగుండ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి ట్రాక్టర్‌పై ఊరేగించారు.